క్లుప్తంగా

నేడు విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక: స్థానిక సంతబయిల పురాతన విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మందపాటి శ్రీ రామ వెంకట నరసింగ రావు (రాము) ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

కళాశాలలో అకడమిక్ ఆడిట్



డిగ్రీ కళాశాలలో ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆదేశాలకు అనుగుణంగా నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్ నిర్వహణ జరిగింది. తుని డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా.నాగరాజు, దిల్లేశ్వరరావు ఆడిటర్లుగా పాల్గొని పలు రకాల దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పలు సూచనలు చేశారు. ఆడిట్‌లో ప్రిన్సిపాల్ ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు. కళాశాలకు బి గ్రేడ్ కేటాయించినట్టు ఆడిటర్ల బృందం తెలిపింది.

కార్పొరేషన్ రుణాలకు 22లోగా దరఖాస్తు చేసుకోవాలి

మునగపాక: ఈనెల 22 లోగా బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఉషారాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024–25 సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. కార్పొరేషన్ల ద్వారా అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. యూనిట్‌ను బట్టి రాయితీ సదుపాయం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని ఉషారాణి తెలిపారు.

హిందీ పరీక్షకు 9 మంది డుమ్మా



కొరుప్రోలులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎస్.రాయవరం: మండలంలో టెన్త్ రెండవ రోజు హిందీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అయిదు పరీక్షా కేంద్రాల్లో 1115 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా మొదటి రోజు 8 మంది, రెండవ రోజు 9 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో 1 అప్పారావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే ఏర్పాట్లు చేశామన్నారు.


మోదమాంబను దర్శించుకున్న అధికారులు



మోదమాంబను దర్శించుకుంటున్న ఆర్ అండ్ బీ ఈఈ విద్యాసాగర్ తదితరులు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబను ఆర్ అండ్ బీ ఈఈ విద్యాసాగర్ బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. వీరితో పాటు మాడుగుల ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పైలా దేముడునాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, స్థానిక నాయకులు పడాల అప్పలనాయుడు, రాయపురెడ్డి కొండలరావు పాల్గొన్నారు.

చురుగ్గా అమ్మవారి ఆలయాల నిర్మాణం




వీరనారాయణం గ్రామంలో నిర్మాణంలో వున్న ఆలయాలు

మాడుగుల రూరల్ : మండలంలో వీరనారాయణం గ్రామంలో నూతనంగా ముత్యమాంబ, పరిదేశమాంబ ఆలయాల నిర్మాణం చురుగ్గా సాగుతున్నాయి. గ్రామ శివార్లలో ఈ ఆలయాలు నిర్మాణానికి ప్రజలు సహకరించాలని ఆలయ అభివృద్ధి నిర్వాహకులు తురుబిల్లి రామారావు కోరారు. ఈ రెండు ఆలయాలు నిర్మాణంలో ఉన్నాయి.

స్వచ్ఛ వాహనం.. నిలువెత్తు నిర్లక్ష్యం





యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో స్వచ్ఛతను మెరుగుపరచడం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సమకూర్చిన వాహనాలపై పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. ఏడాది కాలంగా యలమంచిలి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అలంకారప్రాయంగా ఉన్న సెప్టిక్ ట్యాంకర్ ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. గత ప్రభుత్వ హయాంలో చెత్త సేకరణకు 13 స్వచ్ఛ ఆటోలు, సుమారు రూ.50 లక్షల విలువైన సెప్టిక్ ట్యాంకర్‌ను అందజేశారు. వీటిలో ఛార్జింగ్ బ్యాటరీలతో నడిచే ఆటోలు వినియోగిస్తున్నా సెప్టిక్ ట్యాంకర్‌ను మాత్రం ఏడాదికి పైగా నిరుపయోగంగా వదిలేశారు. గత సాధారణ ఎన్నికలకు ముందు మున్సిపాలిటీకి అందజేసిన సెప్టిక్ ట్యాంకర్‌కు ఆరు నెలల వరకు రవాణా శాఖ వద్ద రిజిస్ట్రేషన్ సైతం చేయించలేదు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినా సెప్టిక్ ట్యాంకర్‌ను మాత్రం ఉపయోగించకుండా వదిలేశారు. మున్సిపల్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిపోయే వారంతా ప్రధాన ద్వారం పక్కనే ఉత్సవ విగ్రహంలా కనిపిస్తున్న సెప్టిక్ ట్యాంకర్‌ను చూసి దీనిని ఎందుకు అలా వదిలేశారో అర్థంకాక అయోమయానికి గురవుతున్నారు. కొందరైతే ప్రజాధనం వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంపై ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంతే అంటూ పెదవి విరుస్తున్నారు. మూలకు చేరిన సెప్టిక్ ట్యాంకర్‌ను వెంటనే వినియోగంలోకి తేవాలని మరికొందరు కోరుతున్నారు.

శాస్త్రీయ పద్ధతిలో మానవ వ్యర్థాల తరలింపునకు ఉపయోగం

చెరువులు, కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో మానవ వ్యర్థాలు చేరకుండా శాస్త్రీయ పద్ధతిలో వాటిని తరలించేందుకు సెప్టిక్ ట్యాంకర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అదే విధంగా డ్రైనేజీల్లోకి మానవ వ్యర్థాలు విడుదల చేయకుండా ఉండేందుకు, ఒకవేళ డ్రైనేజీల్లో మానవ వ్యర్థాలు చేరితే వాటిని మనుషులతో తీయించకుండా ఉండడానికి సెప్టిక్ ట్యాంకర్‌ను వినియోగించుకోవచ్చు. పురపాలక సంఘం పరిధిలో గతంలో బహిరంగ మరుగుదొడ్ల స్థానంలో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో వినియోగిస్తున్న మరుగుదొడ్లు శుభ్రపరిచి వాటి నుంచి మానవ వ్యర్థాలను సెప్టిక్ ట్యాంకర్ ద్వారా శుద్ధి కేంద్రాలకు తరలించే అవకాశం ఉంది. అయినప్పటికీ సెప్టిక్ ట్యాంకర్‌ను ఎందుకు నిరుపయోగంగా వదిలేశారో అధికారులకే తెలియాలి. మంచి ఆశయంతో అందజేసిన సెప్టిక్ ట్యాంకర్‌ను అలంకారప్రాయంగా వదిలేయకుండా తక్షణమే వినియోగంలోకి తెచ్చి ప్రజాధనం వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉంది.

ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణానికి గ్రహణం..

మున్సిపాలిటీలో మానవ మల బురద వ్యర్థాలను శుద్ధి చేసి ఎరువులు తయారు చేసేందుకు వీలుగా 2018లో ఫేకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మించడానికి ప్రతిపాదించారు. ఇందుకోసం బంకా బయోలు సంస్థతో పురపాలక సంఘ అధికారులు ఎంవోయూ కుదుర్చుకున్నారు. పట్టణంలోని శేషుకొండ వెనుక వైపు ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఏడేళ్లుగా దీని నిర్మాణ పనులు అడుగు కూడా ముందుకు పడలేదు. ఎఫ్ఎస్‌టీపీ పనులు పూర్తయితే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నిర్మాణ వ్యయాన్ని కాంట్రాక్టు సంస్థకు చెల్లిస్తారు. అయితే స్పష్టమైన కారణం తెలియనప్పటికీ ఇప్పటి వరకూ ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణం పూర్తికాలేదు. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో ఎఫ్ఎస్‌టీపీ ఉంటేనే సెప్టిక్ ట్యాంకర్‌తో మానవ మల బురద వ్యర్థాలు సేకరించడానికి వీలుంటుంది. లేదా సమీపంలో ఉన్న మున్సిపాలిటీల్లో ఉన్న ఎఫ్ఎస్‌టీపీలకు కూడా తరలించవచ్చు. అయితే సమీపంలో ఉన్న అనకాపల్లి పట్టణ పరిధిలో ఉన్న ఎఫ్ఎస్‌టీపీ కూడా వినియోగంలో లేదు. దీంతో అధికారులకు కూడా ఏం చేయాలో తెలియడంలేదు. నిర్లక్ష్యం ఎవరిదైనా రూ.50 లక్షల ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన వాహనం నిరుపయోగంగా ఉండిపోయింది.



యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న సెప్టిక్ ట్యాంకర్

ఎఫ్ఎస్‌టీపీ పూర్తయితేనే..



మానవ మల బురద వ్యర్థాలను శుద్ధి చేసి ఎరువుగా మార్చే ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణం పూర్తయితేనే మున్సిపాలిటీ పరిధిలో మానవ మల వ్యర్థాలను శుభ్రపరిచేందుకు సెప్టిక్ ట్యాంకర్‌ను ఉపయోగించే వీలుంటుంది. 2018 నుంచి కాంట్రాక్టు సంస్థ పనులు పూర్తి చేయలేదు. సమీపంలో ఎక్కడా ఎఫ్ఎస్‌టీపీలు అందుబాటులో లేవు. దీంతో మానవ మల వ్యర్థాలు సెప్టిక్ ట్యాంకర్ ద్వారా తరలించే అవకాశం లేకుండా పోయింది. వారం రోజుల క్రితం కూడా ఎఫ్ఎస్‌టీపీ నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపాం. సంప్రదించిన ప్రతి సారీ త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారు గానీ అమలు కావడం లేదు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– టీజేఎస్ ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్

23న సర్వసభ్య సమావేశం

అచ్యుతాపురం రూరల్ : మండల సర్వసభ్య సమావేశం 23వ తేదీన నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో మునుపెన్నడూ లేని విధంగా ఆదివారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం విడ్డూరమని, వారమంతా విధి నిర్వహణలో అలసిపోయి, సెలవు రోజు కుటుంబ సభ్యులతో సరదాగా గడపేందుకు కానీ, ఇతర వ్యక్తిగత పనులు చేసుకునేందుకు గానీ వీలు లేకుండా పోతుందని కొందరు అధికారులు బయటికి చెప్పలేక ఆవేదన చెందుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు



అంగన్‌వాడీ కేంద్రం ఎదురుగా పగిలిన మద్యం సీసాలు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కొంత మంది యువకులు తాగేసిన మద్యం సీసాలు వదిలేస్తున్నారు. వాటిని కొందరు పగులగొడుతున్నారు. దీంతో కేంద్రానికి వచ్చే పిల్లలతో పాటు బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాల్సిన యువతే పెడదారిన పట్టడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి మద్యానికి బానిసలై రాత్రి సమయంలో విచ్చలవిడిగా తాగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

100 శాతం ఈకేవైసీ పూర్తి చేయాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

పాయకరావుపేట: మండలంలో గల మాసాహేబుపేట, పెంటకోట గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి పి.ఆదినారాయణ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ఏపీ ఫార్మర్ రిజిష్టరీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకేవైసీ 100 శాతం పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. రైతులు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి త్వరితగతిని ఏపీ ఫార్మర్ రిజిష్టరీ చేసుకోవాల్సిందిగా కోరారు. పంటలకు సోకే తెగుళ్ల సోకకుండా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాసాహేబుపేట ఉద్యాన సహాయకులు జి.అజయ్, వ్యవసాయ సహాయకులు పి.సతీష్, సర్పంచ్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్ షెల్టర్లు



అన్నవరం జంక్షన్‌లో శిథిలమైన బస్ షెల్టర్

కోటవురట్ల: ప్రయాణికులు వేచి ఉండేందుకు ప్రధాన కూడళ్లలో నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలమై నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలోని అన్నవరం జంక్షన్, జల్లూరు, సుంకపూరు, కోటవురట్ల, పాతరోడ్డు, రామచంద్రపురం జంక్షన్లలోని బస్ షెల్టర్లు పూర్తిగా శిథిలమయ్యాయి. సుమారు 25 ఏళ్ల క్రితం ఎంపీ నిధులతో వీటిని నిర్మించారు. అప్పటి నుంచి వీటిపై ఎటువంటి నిర్వహణ, అభివృద్ధి పనులు లేకపోవడంతో మొత్తం షెల్టర్లు అన్నీ శిథిలమయ్యాయి. దాంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు అవకాశం లేకుండా పోయింది. షెల్టర్ల లోపల అరుగులు పూర్తిగా పెచ్చులూడి కూర్చునే వీలు లేకుండా తయారయ్యాయి. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండుటెండలో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులు, మహిళలు బస్సులు, ఆటోల కోసం రహదారుల్లో ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ నిధులతో అయినా వీటికి మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సర్వేలతో ప్రజలకు మేలు



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు



సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

పాయకరావుపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పి–4 సర్వేని విజయవంతం చేయాలని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. బుధవారం ఆయన పలు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. సర్వే వల్ల ప్రజలకి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు పొందాలంటే ఈ సర్వేలో నమోదు అయి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ అధికారులకు సమగ్ర సమాచారం అందజేయాలన్నారు. కార్యదర్శులు నిర్దేశించిన గడువులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన దోసలపాడు డొంకాడ గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను పరిశీలించారు. ఆధార్‌లో తప్పు ఒప్పులను సరి చేసేందుకు నిర్వహిస్తున్న ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధిపై కార్యదర్శులకు అవగాహన..

పాయకరావుపేట: మండలంలో గల ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది చేపట్టిన పి- 4 సర్వేను పరిశీలించినట్లు ఎంపీడీవో జయప్రకాష్ రావు అన్నారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఇంటి పన్ను వసూలు, చెత్త నుండి సంపద కేంద్రాల అభివృద్ధిపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఈవోఆర్‌డీ సీహెచ్ చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌కు రూ.100 కోట్లు మంజూరు చేయాలి

మాడుగుల రూరల్ : రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని గాడిలో పెట్టి, కూటమి ప్రభుత్వం ఫ్యాక్టరీ సభ్య రైతులు, కార్మికులు, ఫ్యాక్టరీ అభివృద్ధికి రూ. 100 కోట్లు నిధులు మంజూరు చేయాలని మాడుగుల నియోజకవర్గ కాంగ్రెసు పార్టీ ఇన్‌చార్జి పడాల కొండలరావు డిమాండ్ చేశారు. బుధవారం అయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ పరిధిలో గల దేవరాపల్లి మండలం, కొత్తపెంటలో చెరకు రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, చెరకును సకాలంలో క్రషింగ్ చేయాలేకపోయామని మనస్తాపం చెంది చెరకు తోటకు నిప్పుపెట్టిన ఘటన పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 23 వేల మంది రైతులు, మరో 300 మంది కార్మికులు ఆధారపడి పనిచేస్తున్నారని, క్రషింగ్‌లో సాంకేతిక లోపాల వల్ల ఒక టన్ను చెరకు 15 రోజుల పాటు కాటాల వద్ద ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సాంకేతిక పరమైన సమస్యలకు చెక్ పెట్టాలని, తోలిన చెరకుకు సకాలంలో పేమెంట్లు ఇవ్వాలని, కార్మికులకు జీతాలు ఇవ్వాలని ఆయన ఫ్యాక్టరీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.

మాలమహానాడు ఆందోళన



ధర్నా చేస్తున్న మాలమహానాడు ప్రతినిధులు

చోడవరం : ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. చోడవరం కొత్తూరు జంక్షన్ సమీపంలో ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా మెయిన్‌రోడ్డుపై ధర్నా చేశారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని ప్రభుత్వం వన్‌మ్యాన్ కమిషన్ వేయడం దురదృష్టకరమన్నారు. వర్గీకరణ జరిగితే ప్రధానంగా మాల కులస్తులు ఎక్కువగా నష్టపోతారని, వర్గీకరణ చేయకుండా ఎస్సీలందర్నీ ఐక్యంగా ఉండేలా చూడాలని ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. అనంతరం వినతిపత్రాన్ని ఎమ్మెల్యే కార్యాలయానికి అందజేశారు. ఆందోళనలో అనకాపల్లి జిల్లా కమిటీ అధ్యక్షుడు వేచలపు సహదేముడు, ప్రధాన కార్యదర్శి రెల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాలతల్లి గరగలు ఊరేగింపు



గరగలు ఊరేగిస్తున్న దృశ్యం

గొలుగొండ : లింగంపేట నూకాలతల్లి అమ్మవారి గరగలు (ఘటాలు) ఊరేగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆలయ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లింగంపేట నుంచి గొలుగొండ వరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి గ్రామంలో మహిళలు నీళ్ల బిందెలతో స్వాగతం పలికారు. ఈ ప్రాంతంలో ఇలవేల్పుగా పేరున్న లింగంపేట నూకాలమ్మతల్లి పండగ ఈనెల 28 నుంచి వారం రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది. ముందుగా అమ్మవారం ఘటాలు ఊరేగింపు నిర్వహించి పండగను ప్రారంభం చేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ ఎంపీపీ అడిగర్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పరవాడ అప్పలనాయుడు, లింగంపేట ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



నిరసనలో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి తదితరులు

మాడుగుల : జాలంపల్లి పంచాయతీ శివారు గ్రామం సిరిపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో గిరిజన ప్రజలు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి గ్రామంలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి గిరిజన ప్రజలకు దాహం తీర్చాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన చెదల రాధ, కొర్రా బీమేషమ్మ, చెదల కృష్ణ, చిత్రాల సన్యాసిరావు, కిల్లో కాంతమ్మ, కిల్లో సత్తిబాబు, కొర్రా సుందరరావు, పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ

కె.కోటపాడు : కె.కోటపాడు హైస్కూల్‌లో పది పబ్లిక్ పరీక్ష కేంద్రం వద్ద సత్యసాయి భక్తులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా పరీక్ష అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బందికి సత్యసాయి భక్తులు మజ్జిగను అందించారు. మజ్జిగ పంపిణీని కె.సంతపాలెం పోస్ట్‌మాస్టర్ చల్లా సింహాద్రి నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కళిరెడ్డి అప్పలనాయుడు, జిల్లా సేవా సహ సమన్వయకర్త అప్పలనాయుడు, కె.కోటపాడు సమితి కన్వీనర్ నారాయణపాత్రుడు పాల్గొన్నారు.

వేసవిలో పశుసంరక్షణకు జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్

కె.కోటపాడు : పాడి రైతులు వేసవికాలంలో పశుసంరక్షణలో జాగ్రత్తలు పాటించాలని, తద్వారా పశువులు వ్యాధుల బారిన పడకుండా పాల దిగుబడి తగ్గకుండా చూసుకోవచ్చని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇ.దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రంలో బుధవారం ఆయన పాడి రైతులకు పలు సూచనలను చేశారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడం వల్ల పశువులను రైతులు ఉదయం 10 గంటలు లోగా మేతకు తీసుకువెళ్లాలని మరలా సాయంత్రం 4 గంటల తరువాత బయటకు తీసుకువెళ్లడం వల్ల వేసవి ఉష్ణోగ్రతల బారిన పశువులు పడకుండా చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా పశువులకు నీటితో రెండు సమయాల్లోను శుభ్రపర్చాలని తెలిపారు. తద్వారా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టనున్నట్టు దినేష్‌కుమార్ తెలిపారు. అలాగే పశువులను మధ్యాహ్నం సమయాల్లో గాలి, వెలుతురు తగిలే ప్రాంతాల్లోను, చెట్ల కింద ఉంచాలని ఆయన సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా పశువులకు తాగేందుకు మంచి నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ నెల 30 వరకూ గాలికుంటు టీకాలతో పాటు పశు బీమా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కోళ్లఫారాలు



మునగపాక-పాటిపల్లి దారిలో కోళ్ల ఫారం

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా మండలంలో పలు చోట్ల కోళ్ల ఫారాల నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనారోగ్యానికి దారి తీసే కోళ్ల ఫారాల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీ అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా ఎక్కడా అటువంటి దాఖలాలు లేవని చెప్పాలి. మునగపాక నుంచి పాటిపల్లికి వెళ్లే దారిలో పాటిపల్లి పంచాయతీ పరిధిలో కోళ్లఫారం ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు కోళ్లఫారం ద్వారా వచ్చే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. కోళ్లఫారం ఏర్పాటు చేసే ముందు పంచాయతీ తీర్మానం తప్పనిసరి. అయితే కొంత మంది తమకు పట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తుంది. దీనికి తోడు ఈగల బెడద కూడా పెరుగుతుందని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి కోళ్లఫారం ఏర్పాటుకు సంబంధించి నియమ నిబంధనలు పాటించేలా చూడాలని పలువురు కోరుతున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పూడిమడక రోడ్డు విస్తరణ పనుల్లో కదలిక



మునగపాకలో బ్రిడ్జి నిర్మాణానికి జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల మేర 100 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే బాధితుల వివరాలు దాదాపుగా గుర్తించారు. కొన్ని చోట్ల పరిహారం చాలదంటూ బాధితులు సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్న సంగతి తెలిసిందే. ఏది ఏమైనా రహదారి విస్తరణ చేపట్టేందుకు పాలకులు, అధికారులు నడుం బిగించారు. చట్ట ప్రకారం బాధితులకు పరిహారం అందిస్తామంటూ చెప్పుకొచ్చారు. రహదారి విస్తరణ ద్వారా కలిగే ప్రయోజనాలను పలు మార్లు గ్రామసభల్లో అధికారులు వివరించారు. ఈ క్రమంలో మునగపాక కృష్ణంరాజు కాలువపై గతంలో నిర్మించిన బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జికి సమాంతరంగా కొత్త బ్రిడ్జి నిర్మించేందుకు అవసరమయ్యే చర్యలు బుధవారం ప్రారంభమయ్యాయి. జేసీబీ సాయంతో బ్రిడ్జి నిర్మాణానికి అనువుగా ఉండేలా స్థలం మెరుగుపరుస్తున్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



చీడికాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవికుమార్

చీడికాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవికుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో పోస్టుల గురించి వైద్యాధికారి సునీల్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ నర్స్, ఎంఎల్‌హెచ్‌పీ, ఇతర సిబ్బంది పోస్టులు ఖాళీలు గురించి అడిగి తెలుసుకున్నారు. పెదగోగాడ పీహెచ్‌సీలో పనిచేస్తున్న సిబ్బందిని సర్దుబాటులో భాగంగా స్టాఫ్‌నర్స్‌ని ఈ పీహెచ్‌సీకి డిప్యూటేషన్ చేస్తానని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీలో రోజువారీ ఓపి సంఖ్యను పెంచాలని, పీహెచ్‌సీకి వచ్చే రోగులకు ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాలని, గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు క్షేమదాయకం



చిన్నారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : గర్భిణులు ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవించడం క్షేమదాయకమని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. ఆనందపురం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య పరీక్షలను ఆమె నిర్వహించారు. 79 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య తనిఖీలు చేశారు. ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయించుకోవడం వల్ల తల్లిబిడ్డల ఆరోగ్యం క్షేమంగా ఉంటుందని వివరించారు. వృద్ధులు, చిన్నారులు వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. పీహెచ్‌ఎన్ ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ మంగ, ఏఎస్‌ఎం పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.